
నాచగిరి హుండీ ఆదాయం రూ. 14.74లక్షలు



నాచగిరి క్షేత్రంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు, భక్తులు

వర్గల్, జూలై 11: సిద్దిపేట జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర ఆలయ హుండీ లెక్కింపు గురువారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 72 రోజులకు గాను హుండీ లెక్కింపు చేయగా 14,74,097 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు రవికుమార్, ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు, గజ్వేల్ సత్యసాయి సేవాసమితి సభ్యులు, హైదరాబాద్ భ్రమరాంబిక సేవా సమితి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.





నిర్మలా జగ్గారెడ్డికి అభినందనల వెల్లువ

టీజీఐఐసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నిర్మలాజగ్గారెడ్డికి గురువారం పలువురు అభినందలు తెలిపారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, రామచంద్రాపురం పట్టణ కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు.

అర్హులైనా అందని గృహజ్యోతి!



- జిల్లాలో మొత్తం 3,06,697 విద్యుత్ కనెక్షన్లు
- పథకానికి 1,83,157 లబ్ధిదారులు ఎంపిక

- సరైన పత్రాలు లేక, ఆన్‌లైన్ చేసేప్పుడు తప్పిదాలు
- ఫలితంగా పలువురు జీరో బిల్లుకు దూరం
- కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- ఎట్టకేలకు అందుబాటులోకి 'గృహజ్యోతి' వెబ్‌సైట్
- లబ్ధిదారుల్లో చిగురిస్తున్న ఆశలు

నారాయణరావుపేట, జూలై 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే వారికి ఉచిత కరెంటు పథకాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈ పథకంతో తమకు లబ్ధి చేకూరుతుందని జిల్లాలోని అనేక మంది భావించారు. కానీ ఈ పథకం వల్ల కొందరికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది. ఇంకొందరు అర్హులైనా కూడా వారికి పథకం అందని ద్రాక్షగా మిగిలిపోయింది. గృహజ్యోతి పథకం అమలులో భాగంగా అధికారులు పలు దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొన్ని తప్పిదాల వల్లనో, లేదంటే ఇతరత్రా కారణాల వల్లనో పలువురు గృహ వినియోగదారులకు జీరో బిల్లు రావడం లేదు. అర్హులమైనా తమకు ఎందుకు జీరో బిల్లులు రావడం లేదంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ విద్యుత్ డివిజన్‌ల పరిధిలో కేటగిరి1 కింద 3,06,697 కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 1,83,157 మంది గృహజ్యోతి పథకానికి ఎంపికయ్యారు. వీరిలో దాదాపు 6563 మంది వినియోగదారులు వల్ల 200 యూనిట్లు దాటడంతో బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో కొందరు సరైన పత్రాలను, మరికొందరు ఆప్షన్‌లను ఇవ్వకపోవడం, ఆన్‌లైన్ నమోదు చేసే సమయంలో ఆపరేటర్లు చేసిన తప్పిదాల వల్ల చాలా మంది గృహజ్యోతికి నోచుకోలేదు. పథకానికి ఎంపికైన వారిని మినహాయించి మిగిలిన 1,23,540 మంది వినియోగదారుల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. మరికొందరు పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నారు. వీరంతా నాలుగునెలలుగా జీరో బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్‌లో సవరణ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. సవరణల కోసం మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ వల్ల ఇంతకాలం అది కూడా నిలిపివేశారు. జీరో బిల్లులు రాక, సైట్‌లో వివరాలు నమోదవ్వక దరఖాస్తుదారులు నిరాశ చెందుతున్నారు.

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాం



- నాగరాజు, గుర్రాలగొంది, నారాయణరావుపేట

గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రావడం లేదు. మండల కార్యాలయంలో దరఖాస్తు చేశాం. ఎప్పుడు వెళ్లి అడిగినా సైట్ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతినెలా 100 యూనిట్లకు కరెంటు బిల్లు వస్తుంది. ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి గృహజ్యోతి పథకం వర్తింపజేయాలి.

అర్హులందరికీ వర్తింపజేయాలి



- బాపురెడ్డి, విద్యుత్ వినియోగదారుడు, నారాయణరావుపేట

గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారందరికీ వర్తింపజేయాలి. కొన్నిసాంకేతిక కారణాల వల్ల 200 యూనిట్లకు కూడా బిల్లు వస్తుంది. అధికారులు స్పందించి అర్హులందరికీ న్యాయం చేయాలి.

అందుబాటులోకి వెబ్‌సైట్



- శ్రీరాములు, ఎంపీడీవో, నారాయణరావుపేట

గృహజ్యోతి పథకం వర్తించని వారి నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున వెబ్‌సైట్‌ను ఇన్నిరోజులు ఆపేశారు. గురువారం నుంచి గృహజ్యోతి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తాం. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



జక్కాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

కొమురవెల్లి మల్లన్న రైల్వే హాల్ట్‌స్టేషన్‌లో కదలిక

- ప్రారంభమైన స్టేషన్, ప్లాట్‌ఫాం పనులు
- మూడు నెలల్లో పూర్తికి కసరత్తు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొమురవెల్లి శివారులోని హాల్ట్‌స్టేషన్ వద్ద రైల్వేలైన్

చేర్యాల, జూలై 11: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొమురవెల్లి మల్లన్న రైల్వేహాల్ట్‌స్టేషన్ నిర్మాణ పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈమేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కొమురవెల్లి మీదుగా కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టిన క్రమంలో స్థానికంగా మల్లికార్జునస్వామి ఆలయం ఉన్నందున రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. కొన్నినెలలక్రితం రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఫిబ్రవరి 15న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా పనులు ప్రారంభించకపోవడంతో నీలినీడలు కమ్ముకున్నాయి. ఆ తర్వాత నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు లేక ఎలాంటి పురోగతి కానరాలేదు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల 'హాల్ట్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం చేసింది. స్పందించిన రైల్వేశాఖ ఉన్నతాధికారులు పనుల ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. రైల్వేలైన్‌కు రెండువైపులా 20 మీటర్ల చొప్పున స్థలం అందుబాటులో ఉండటంతో గురువారం ఉదయం ప్రతిపాదిత ప్రదేశం వద్ద మొరం చదును చేయించి ప్లాట్‌ఫాం, స్టేషన్ బిల్డింగ్, హాల్ నిర్మాణం పనులు ప్రారంభించారు. గ్రామశివారులో రైల్వే గేట్ ఉండటంతో ప్రజలు, ప్రయాణికుల రాకపోకలకు అవాంతరాలు ఎదురుకాకుండా కొన్నినెలల క్రితం చేపట్టిన అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు చివరిదశకు చేరాయి. త్వరలోనే పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలకు అనుమతించనుడడంతో రవాణా ఇక్కట్లు తీరనున్నాయి.

మూడు నెలల్లో పూర్తి : జనార్దన్, రైల్వే డీఎం

నిధుల మంజూరుతో సంబంధం లేకుండా మల్లన్నహాల్ట్‌స్టేషన్ త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పనులు ప్రారంభించాం. ప్లాట్‌ఫాం, హాల్ట్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలం అందుబాటులో ఉండడంతో పనులు చేపట్టాం. అప్పటివరకు ఇతరత్రా అవసరాలకు ఉపయోగపడే స్థల సేకరణకు సర్వే పూర్తిచేస్తాం. మూడునెలల్లో స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం.



ప్లాట్‌ఫాం నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న సిబ్బంది







గోరింటా పూసింది..

ఆషాఢం వచ్చిందంటే మహిళలు గోరింటాకు (మైదాకు)పై మక్కువ చూపుతారు. గోరింటాకులో ఎన్నో ఔషధగుణాలు దాగి ఉన్నాయి. అలాగే, చేతులకు అందం కూడా.. ఏళ్ల నుంచి వస్తున్న సంప్రదాయాలను హుస్నాబాద్‌లోని పద్మశాలి మహిళలు ఆచరిస్తున్నారు. గురువారం మహిళలందరు కలిసి గోరింటాను కోసి, మెత్తగా నూరి చేతులకు పెట్టుకున్నారు. ప్రతి సంవత్సరం ఆషాఢంలో ఇలా అందరం కలిసి మైదాకు వేడుకను జరుపుకుంటామని వారు తెలిపారు.

- హుస్నాబాద్, జూలై 11

గంజాయి, మత్తు పదార్థాల నివారణకు స్పెషల్‌డ్రైవ్

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 11 : జిల్లాలో గంజాయి, ఇతరత్రా నార్కోటిక్ మత్తుపదార్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి నార్కో-కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం డ్రగ్స్, మత్తుపదార్థాల విక్రయం, రవాణాను పూర్తి నివారించేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టిందన్నారు. జిల్లాలో కూడా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డ్రగ్స్ నివారణపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించాలని సూచించారు. తరగతుల వారీగా యాంటీడ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా బడికి రాని, బడి మానేసిన పిల్లల వివరాలను సేకరించి డ్రగ్స్ బారిన పడకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని డీఈవోకు సూచించారు. జిల్లాలో హాట్‌స్పాట్లను గుర్తించి తరుచూ తనిఖీలు చేయాలని చెప్పారు. పొలాల్లో, తోటల్లో గంజాయి మొక్కలు పెంచకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతువేదికల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని వారికి చెప్పాలన్నారు. జిల్లా కేంద్రంలో డ్రగ్స్ రిహాబిటిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించి స్థలాన్ని అన్వేషించాలని ఆర్డీవోకు సూచించారు. జిల్లాలోని కల్లు కంపౌండ్, మెడికల్ షాపుల్లో అల్ప్రాజోలం విక్రయించకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైన మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14446, 8712671111, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, సిద్దిపేట గజ్వేల్ హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం బన్సీలాల్, రామ్మూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, టీజీ-ఎన్‌బీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వినయ సుస్మి, వ్యవసాయ అధికారి మహేష్, టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ఆర్థిక బలోపేతానికి మహిళా శక్తి

గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళాశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మహిళాశక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సును జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ - గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన డీపీఎం, ఏపీఎం, జిల్లా మండల మహిళా సమాఖ్య, బ్యాంకు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి జయదేవ్ ఆర్య మహిళాశక్తి కార్యక్రమంలో యూనిట్ల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మహిళాశక్తి కార్యక్రమ ప్రక్రియలో జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. అదే సంకల్పంతో యూనిట్ గ్రౌండింగ్ చేసుకుని కష్టపడితే మహిళలు ఉన్నత స్థాయి చేరుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

భూములు అన్యాంక్రాతం అవుతున్నా చోద్యం చూస్తున్నారు

- మొక్కలు నాటేందుకు అటవీశాఖకు అనుమతి ఎలా ఇస్తారు?
- ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్లాట్ల బాధితులు


సమావేశమైన ప్లాట్ల బాధితులు

పటాన్‌చెరు, జూలై 11 : నాలుగు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం న్యాయపోరాటం చేస్తున్నా ఫలితం దక్కడం లేదని, తమ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో రియల్టర్ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ప్లాట్ల యజమానులు బీరంగూడలోని లేఅవుట్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పటాన్‌చెరు, బీరంగూడా, తెల్లాపూర్ గ్రామాల్లో 1980లో వేసిన లేఅవుట్లలో సుమారు 8500 మంది ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వ భూములను కలుపుకుని పట్టాభూములుగా చూపిస్తూ లేఅవుట్లు వేసి విక్రయించారని తేలడంతో వివాదం రాజుకుందన్నారు. ఎన్నో ప్రయాసల మధ్య బాధితులకు స్థలాలను మార్కెట్ ప్రకారం క్రమబద్ధీకరించాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తుచేశారు. ఈ క్రమబద్ధీకరణ జీవోను సవాలు చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సదరు లేఅవుట్లలో పట్టాభూములు, ఎక్స్‌సర్వీస్‌మెన్లు, స్వాతంత్ర సమరయోధుల భూములను మినహాయించి, అసైన్డ్, ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా నేటికి అమలుకు నోచుకోవడం లేదని బాధితులు వాపోయారు. రెవెన్యూ యంత్రాంతం సహాయ సహకారాలతోనే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాగా నేడు ప్లాట్లు నిజమైన యజమానులకు దక్కకుండా కుట్రలు సైతం వారే చేస్తున్నారని ఆరోపించారు. డీఆర్వో కస్టడీలో ఉన్న సొసైటీ భూమి అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఇప్పటికే 20ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిందన్నారు. కోర్టు విచారణలో ఉన్న సర్వే నంబర్ 1000లో అటవీశాఖ చెట్లు నాటే కార్యక్రమానికి రెవెన్యూ అధికారులు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. ప్లాట్ల స్థలాలలో చెట్లు నాటితే సహించేది లేదన్నారు. మరోవైపు 990, 997 సర్వే నంబర్లలో నోటరీల ద్వారా సొసైటీ భూములు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

టైర్ కోసం వెళ్లి.. చెరువులో మునిగి బాలుడి మృతి


బాలుడి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

ఝరాసంగం, జూలై 11 : మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో గురువారం చెరువులో మునిగి బాలుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్(8), మరో బాలుడు ఇద్దరు గ్రామ సమీపంలోని చెరువు కట్టపై టైరు ఆట ఆడుతూ వెళ్తున్నారు. విష్ణువర్ధన్ టైరు నేరుగా చెరువులోకి వెళ్లగా, బాలుడు టైరు కోసం చెరువు నీటిలోకి దిగాడు. మరో బాలుడు అరుపులు, కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే నీటిలో మునిగి మృతిచెందిన విష్ణువర్ధన్‌ను స్థానికులు ఒడ్డుపైకి చేర్చారు. విష్ణువర్ధన్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు రవి, పుష్పలత, కుటుంబీకులు చెరువుకట్ట వద్దకు చేరి బాలుడి మృతదేహాన్ని చూసి విలపించారు.

ఐఐటీహెచ్‌లో 15న ఇన్నోవేషన్ డే

కంది, జూలై 11: కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో ఈ నెల 15న ఇన్నోవేషన్‌డేను నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇన్నోవేషన్ డేలో దేశంలోని ప్రముఖ సంస్థలకు చెందిన స్టార్టప్‌లను ప్రదర్శించనున్నారు. ఈ ఈవెంట్‌లో పీచ్ సెషన్‌లు, ప్యానల్ చర్చలు, సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శనలు ఉంటాయి. పాల్గొనే వారు ఐటీఐసీ.ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసువాలని ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు.

అరుణాచలానికి ఆర్టీసీ లగ్జరీ బస్సు

● సంగారెడ్డి ఆర్టీసీ డీఎం ఉపేందర్

సంగారెడ్డి అర్బన్, జూలై 11 : ఆషాడమాసం సందర్భంగా అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడపాలని నిర్ణయించినట్టు సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న సాయంత్రం 6 గంటలకు సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి అరుణాచలానికి బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఒక్కో ప్రయాణికునికి ప్యాకేజీ కింద రూ.4100 చొప్పున చెల్లించాలని తెలిపారు. భక్తులు టీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9959226267, 7382831275 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

● వడ్లు, బియ్యం నిల్వల పరిశీలన



రైస్‌మిల్లులోని వడ్ల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పుల్‌కల్, జూలై 11 : చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని శ్రీసాయి వీరభద్ర రైస్‌మిల్లులో గురువారం పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. సిద్దిపేట డీఎస్‌వో తనూజ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు బియ్యం నిల్వలు, ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం నిల్వలు ఏమేరకు ఉన్నాయంటూ రైస్‌మిల్లు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డిలలోని గోదాముల్లో నిల్వ ఉంచిన మూడు సీజన్లకు సంబంధించిన వరి ధాన్యాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు నిల్వలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వచ్చే సెప్టెంబరు 30వ తేదీ నాటికల్లా వందశాతం కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని సిద్దిపేట డీఎస్‌వో తనూజ తెలిపారు. నిర్ధేశిత లక్ష్యం మేరకు బియ్యం అందజేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ప్రభాకర్, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఏఎస్ఐ వెంకటేశం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● 15 తులాల వెండి, అర తులం బంగారం అపహరణ



బీరువా పగలగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

కంది, జూలై 11 : కందిలో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివసించే జంగంగారి రాములు ఇంటికి తాళం వేసుకుని సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రెండు రోజులుగా అక్కడే ఉన్నారు. బుధవారం రాత్రి ఆ ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు చొరబడ్డారు. బీరువా పగలగొట్టి అందులోంచి 15 తులాల వెండి, అరతులం బంగారం చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసి ఇంటిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం, బీరువా పగులగొట్టి సొత్తు ఎత్తుకెళ్లడం చూసి కంగుతిన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు క్లూస్ టీంతో వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



కొక్కొండ నీరజ(ఫైల్)

చేర్యాల, జూలై 11 : కుటుంబ కలహాలతో మనోవేదనకు గురై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొక్కొండ నీరజ (30)కు ఆమె భర్త, కుటుంబసభ్యుల మధ్య తగాదాలు తలెత్తాయి. ఈవిషయమై మనస్థాపానికి గురైన నీరజ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు అక్రమ సంబంధం నెపంతో అత్తింటివారు చిత్రహింసలకు గురి చేయడంతోనే తమ కూతురు నీరజ ఆత్మహత్య చేసుకుందని నీరజ పుట్టింటి వారు ఆందోళన చేపట్టారు. పోలీసులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లి..


బావిలో శవమై తేలాడు



బావిలో రమేష్ మృతదేహం

మునిపల్లి, జూలై 11 : మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి బావిలో శవమై తేలిన సంఘటన గురువారం మునిపల్లి మండలంలో వెలుగుచూసింది. ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గురుజువాడ గ్రామానికి చెందిన గడ్డం రమేష్(35)కు పదేళ్ల క్రితం మునిపల్లి మండలం బుదేరాకు చెందిన మమతతో వివాహం అయింది. కొన్నాళ్లుగా అత్తగారి ఇంటి వద్ద బుదేరాలోనే నివాసం ఉంటున్నారు. మూడు రోజుల క్రితం పనికి వెళ్తున్నానని చెప్పి రమేష్ ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా రమేష్ ఆచూకీ లభించలేదు. కాగా గురువారం బుదేరా గ్రామ శివారులోని ఓ బావిలో రమేష్ మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో మునిపల్లి ఏఎస్ఐ ఏసయ్య సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. రమేష్ భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు. అయితే రమేష్‌కు పదేళ్లయిన పిల్లలు లేకపోవడంతో మనోవేదనకు గురయ్యేవాడని, ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి



యాదగిరి (ఫైల్)

చిన్నకోడూరు, జూలై 11 : బిల్డింగ్ స్లాబ్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలైన ఎలక్ట్రీషియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని కంచరి బజార్‌కు చెందిన బోనగిరి యాదగిరి(54) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు ఉండేవాడు. యాదగిరి గత నెల 21న మధ్యాహ్న సమయంలో మండలంలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో విద్యుత్ పనులు చేయడానికి వెళ్లాడు. యాదగిరి స్లాబ్‌లో కరెంట్ పైపులైన్ వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీనితో తల వెనక, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. యాదగిరిని వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాదగిరి బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా యాదగిరికి ముగ్గురు కూతురులు, ఓ కుమారుడు ఉన్నారు.

కరుణించు వరుణదేవా..



సదాశివపేట సంగమేశ్వర మందిరంలో..



జహీరాబాద్ మాణిక్‌ప్రభు మందిరంలో..



నాగల్‌గిద్ద మండలం దామర్‌గిద్దలో..

వానాకాలం సీజన్ నెల గడిచినా ఒక్క పెద్ద వర్షం కూడా పడలేదు. వేసుకున్న విత్తనం మొలకెత్త లేదు. మొలకెత్తిన చోట వాడిపోతున్నాయి. వరినాట్ల ఊసే లేదు. దీంతో, రైతన్నలు వరుణుడి కరుణ కోసం పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. నాగల్‌గిద్ద మండలంలో రైతులు భజనలు చేస్తూ పాదయాత్రగా వెళ్లి ఆలయాలను దర్శించుకున్నారు. సదాశివపేట పట్టణం సంగమేశ్వర మందిరంలో, జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు ఆలయంలో శివుడికి జలాభిషేకం చేశారు. గంగను భువిని పంపమని వేడుకున్నారు.

-నాగల్‌గిద్ద/సదాశివపేట/జహీరాబాద్

అధిక రాబడినిచ్చే పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

● వ్యవసాయ అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, జూలై 11 : ఉత్పత్తి ఖర్చు తగ్గించి, అధిక రాబడిని అందించే పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్నదే లక్ష్యంగా అవగాహన కల్పించాలని సూచించారు. కొల్చారం రైతు వేదికలో గురువారం ఆయిల్‌పామ్ సాగు విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొనగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ ఆదాయం పెంపొందించే మార్గాలపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రతీ వ్యవసాయ విస్తీర్ణాధికారి రైతు వేదికలలో నిత్యం అందుబాటులో ఉండాలని, తన క్లస్టర్ పరిధిలోని గ్రామాలలో పర్యటించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు అందించాలన్నారు. ప్రతీ రైతు వేదిక క్లస్టర్ పరిధిలో 20 మంది రైతులతో సేంద్రియ సాగు విధానం చేపట్టాలన్నారు. బ్యాంకులో రుణాలు పొందలేని రైతుల వివరాలను సేకరించి వారికి సంబంధిత బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరయ్యే విధంగా రైతులకు తోడ్పాటు అందించాలని తెలిపారు. ఉత్తమ పద్ధతులు పాటిస్తున్న రైతులను ఎంపిక చేసి మిగతా రైతులు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎప్పటికప్పుడు మండల వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు తమ పరిధిలోని మండలాలు, డివిజన్లలో ఫర్టిలైజర్ దుకాణాలను విస్తృతంగా తనిఖీ నిర్వహించాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, సరిపడా ఎరువులను ప్రాథమిక సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రైవేటు దుకాణాల ద్వారా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, జిల్లా ఉద్యావనశాఖ అధికారి నర్సయ్య రామాయంపేట, నర్సాపూర్, కౌడిపల్లి ఏడీలు వసంత సుగుణ, సంధ్య, పుణ్యవతి, ఆయిల్‌పామ్ సాగు రాష్ట్ర ప్రత్యేక అడ్వైజర్ శ్రీరంగనాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూంను పరిశీలన

మెదక్ అర్బన్, జూలై 11 : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం మెదక్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూంను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీటీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌లను భద్రపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విధులను బాధ్యతతో నిర్వహించాలి

మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని, వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్‌లో భాగస్వాములవ్వండి

● సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 11 : సొసైటీ ఫర్ సంగారెడ్డి కౌన్సిల్‌లో ఇంజనీరింగ్, మెడికల్ విద్యా సంస్థలతో పాటు వివిధ రంగాలు భాగస్వామ్యం కావాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళా ఉద్యోగుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యా సంస్థలు ఎలాంటి సమస్యలున్నా ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇస్తే సమస్య జఠిలం కాకుండా చూస్తామన్నారు. గంజాయి, డ్రగ్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిందని, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. పరిశ్రమల, విద్యాసంస్థల బస్ డ్రైవర్లు విధుల్లోకి వెళ్లే ముందు తప్పనిసరిగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఎస్ఎస్‌సి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రంజిత్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణతో మానసిక, శారీరక ధృడత్వం

పోలీసు శిక్షణ మానసికంగా, శారీరకంగా ధృఢంగా చేస్తుందని, సర్వీసు మొత్తం ఆరోగ్యంగా ఉండటానికి దోహద పడుతుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి మండలం చిద్రుప్పలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా రోజువారీ విధుల్లో ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా అధిగమించాలి, అత్యవసర, విపత్కర సమయాల్లో సైతం ఎలా నిలబడాలో, ధైర్య సాహసాలను నింపుతుందన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసి ఉత్తీర్ణత పొంది మీ జిల్లాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం శిక్షణా కానిస్టేబుళ్లతో కలిసి భోజనం చేశారు.

జనాభా నియంత్రణకు సహకరించాలి

● సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, జూలై 17 : జనాభా నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జడ్పీ ఆఫీస్ నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ జనాభా గణనీయంగా పెరుగుతున్నదని, దీంతో మౌలిక వసతులు కొరవడి ప్రజాజీవనం స్తంభించిపోతున్నదన్నారు. విద్య, వైద్యం ఉపాధి, ఆహారం, జీవనం తదితర అవసరాలకు పోటీ పెరిగి సమాజంలో అసమానతలు ఏర్పడుతాయన్నారు. ఇది భవిష్యత్తు తరాలకు ప్రమాదమన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ మాట్లాడారు. కాగా కుటుంబనియంత్రణలో సేవలందించిన డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కుటుంబ నియంత్రణ పాటించిన లబ్ధిదారులకు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ మెస్‌ల నిర్వహణకు తర్వలో టెండర్లు

● ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్న అధికారులు



మెస్‌ను పరిశీలిస్తున్న అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు

పుల్‌కల్, జూలై 11: సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలోని వసతిగృహాల మెస్‌ల నిర్వహణకు తర్వలో టెండర్లు పిలవనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహా తెలిపారు. ఈ విషయమై జేఎన్టీయూహెచ్ ఉన్నతాధికారులకు సమాచారం అందించామని టెండర్ల తేదీలను ప్రకటించే అవకాశాలున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదంటూ కొంతకాలంగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ నెల 9న చట్నీ పాత్రలో ఎలుక చక్కర్లు కొడుతున్న వీడియో వైరల్‌గా మారింది. దీంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ఆదేశాల మేరకు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, స్థానిక తహసీల్దార్ ఈశ్వరీరాణిలు బుధ, గురువారాల్లో వేర్వేరుగా ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహను వెంటబెట్టుకుని బాలురు, బాలికల వసతి గృహాల్లోని భోజనశాలలకు వెళ్లి వండిన టిఫిన్, చట్నీ, అన్నం, కూరలను పరిశీలించారు. వంట గదులు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా ఆరా తీస్తూ స్వయంగా పరిశీలించారు. మరో పక్క ఇటీవల అపరిశుభ్రమైన వాతావరణంలో బాలుర మెస్ నిర్వహణ కొనసాగుతుందంటూ ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారుల బృందం తనిఖీల్లో బయటపడగా, ఆ మెస్‌ను సీజ్ చేశారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న సుమారు 1,400 మంది బాల, బాలికలకు ప్రస్తుతం బాలికల వసతి గృహంలో వంటలు వండి అందజేస్తున్నారు. ఇక్కడి నుండే ఆహారాన్ని బాలుర వసతి గృహానికి సరఫరా చేస్తున్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, జూలై 11 : ఐసీడీఎస్ ఉద్యోగులు సమయపాలన పాటించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. బాలల సదనాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని, మెనూ విషయంలో రాజీపడకూడదన్నారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా పాటించాలని సంబంధిత ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

అంగన్‌వాడీ సేవలను విస్తృత పరచాలి

● సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

జహీరాబాద్, జూలై 11 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు, బాలింతలకు అందించే సేవలను విస్తృత పరచాలని సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, తదితరాలపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలో రంజోల్ రైతువేదికలో పూర్వ ప్రాథమిక విద్య కార్యచరణ ప్రణాళికై అంగన్‌వాడీ టీచర్లకు కొనసాగుతున్న శిక్షణకేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సునీతాబాయి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి సమీపంలోనే ప్రైవేట్ పాఠశాల

● పట్టించుకోని విద్యా శాఖ అధికారులు



పెంకుటింట్లో ఏర్పాటు చేసిన స్కూల్

సిద్దిపేట క్రైం, జూలై 11 : బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్పష్టమవుతుంది. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడులకు కూతవేటు దూరంలోనే ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేశారు. దాంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఆ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు తీసుకెళ్తున్నారు.

అనుమతి లేకుండా ఏర్పాటు ?

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండానే ప్రైవేటు స్కూల్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల వరకు ఎలాంటి ప్రైవేట్ స్కూల్ ఉండకూడదు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు విద్యా బోధన చేస్తున్నారు. ఈ ప్రైవేట్ స్కూలుకు అనుమతి లేకపోవడంతో గ్రామస్థులు విద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో స్కూల్ పెట్టకూడదని హెచ్చరించారు. దాంతో ఆ ప్రైవేట్ స్కూల్ యజమాన్యం ప్లే స్కూల్ ఏర్పాటు చేసింది. ప్లే స్కూల్లో నర్సరీ విద్యార్థులే ఉండాల్సి ఉంటుంది. కానీ, ఆ ప్రైవేట్ స్కూల్లో నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల అడ్మిషన్ తీసుకుంటున్నారు. ఈ విషయంలో విద్యా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రీ విద్యా విధానం ఏర్పాటు చేసి నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు బోధన అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక చేసింది. ఈ ప్రైవేట్ ప్లే స్కూల్ ఏర్పాటుతో అటు అంగన్‌వాడీ కేంద్రానికి ఇటు ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రాలేకపోతున్నారు.

పెంకుటిల్లులో స్కూల్

ప్రభుత్వం నియమ నిబంధన ప్రకారం ఒక ప్రైవేటు పాఠశాలకు అనుమతి కోసం బిల్డింగు, విశాలమైన తరగతి గదులతో పాటు, విద్యార్థులు ఆడుకోవడానికి మైదానం, ఫైర్ సెక్యూరిటీ ఉండాలి. కానీ పొన్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ స్కూలు పెంకుటిల్లులో కొనసాగుతున్నది. విద్యా శాఖ అనుమతి లేకుండానే ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

మద్యంషాపు వద్దంటూ

మహిళల ఆందోళన



మదూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట, జూలై 11 : గతంలో సంగాయిపల్లి గ్రామ శివారులో ఉన్న మద్యం షాపును తొలగించి మదూరు గ్రామశివారులో ఏర్పాటు చేసేందుకు నిర్వహకులు షాపులో మరమ్మతు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న మదూరు గ్రామంలోని కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని నిరసన చేపట్టారు. మద్యంషాపును తొలగించాలని నినాదాలు చేశారు. పరిమిషన్ ఇచ్చిన ఎక్సైజ్ అధికారులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైన్స్ షాపు ఏర్పాటు చేస్తే తమ కుటుంబాలు వీధిన పడుతాయని, జీవితాలు నాశనమయ్యే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లకుండా మద్యం షాపు వద్ద ఉంటారని మహిళలు వాపోయారు. తాగుడుకు బానిసై ఇప్పటికే చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయని, మద్యం షాపు రద్దు చేసేవరకు పోరాటం చేస్తామని అధికారులను హెచ్చరించారు.

70 వేల మొక్కలు నాటాలి

● ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు, జూలై 11: వనమహోత్సవంలో మండలానికి కేటాయించిన 70 వేల మొక్కలను నాటి టార్గెట్‌ను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డు అసిస్టెంట్లకు ఎంపీడీవో సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యానవన పంటల కింద మామిడి, మునగ, మల్బరి, ఆయిల్‌పామ్ తదితర పంటల కోసం 110 ఎకరాలు ఎంపిక చేశామన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లు కావల్సిన వారిని ఎంపిక చేసి జాబితా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ పరుశురాములు, కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'బోనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు'



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ నరసయ్య, తదితరులు

గజ్వేల్, జూలై 11: గజ్వేల్ పట్టణంలో ప్రతీ ఏటా నిర్వహించే బోనాల ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఆలయం వద్ద ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌కు, ఆలయం వద్ద ఏర్పాట్లను చూడాలని ఏఈ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఆయనవెంట 2వ వార్డు కౌన్సిలర్ బాలమణి తదితరులు ఉన్నారు.

ఈతవనం స్థల ఆక్రమణకు యత్నం?

● ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం గతంలో ఈత చెట్ల తొలగింపు

● పట్టించుకోని అధికారులు

మద్దూరు, జూలై 11: గీత కార్మికులకు కేటాయించిన స్థలంలో నాటిన ఈతచెట్లను తొలగించి, ధాన్యం కొనుగోలు కేంద్రానికి అనువుగా మార్చుకోవడమే కాకుండా కొందరు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడంపై గీత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం మద్దూరు మండలం సలాఖ్‌పూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత గీత కార్మికుల సంఘం కథనం ప్రకారం.. కల్లు గీత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా తాటి, ఈత వనాల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీత కార్మికుల, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో లక్షల తాటి, ఈత చెట్లను నాటించింది. కాగా మద్దూరు మండలం సలాఖ్‌పూర్ గ్రామానికి ఆనుకుని ఉన్న 290 సర్వేనెంబరులో పూర్వం ఇనాంగా వచ్చిన 6 ఎకరాల భూమిలో ఈత వనం ఏర్పాటు చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు సరఫరా చేసిన ఈత మొక్కల్ని నాటించారు. ఈత వనం ఏర్పాటుతో ముందు తరాలకు జీవనోపాధి లభిస్తుందని భావించి మొక్కల్ని బతికించుకునేందుకు 2010లో ఉపాధిహామీ పథకంలో నీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఫామ్‌పాండ్ నిర్మాణం చేయించడంతో పాటుగా కులసంఘం ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు చేసుకుని డ్రిప్పు సౌకర్యానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ తరుణంలో రైతుల కల్లాల ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో గత అధికార పార్టీ నాయకులు కొందరు ఈత చెట్లను ఎక్సకవేటర్‌తో తొలగించి భూమి చదును చేస్తుండగా కులసంఘం వారు అడ్డుకున్నారు. అయినా దౌర్జన్యంగా కల్లానికి స్థలాన్ని అనువుగా మార్చారు. అప్పటి నుంచి పంట కోతల అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం కొంత మంది ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ స్థలంలో అక్రమంగా ఓ షెడ్డు నిర్మించారని వారు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈత వనానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.



ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న గీత కార్మికులు(ఫైల్)



ఈతవనంలోని భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డు

1600 మొక్కలు నాటాం



ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అందించిన సుమారు 1600 మొక్కల్ని 6 ఎకరాల్లో నాటుకున్నాం. మొక్కల్ని బతికించుకునేందుకు కులసంఘం ఆధ్వర్యంలో బోరును కూడా ఏర్పాటు చేసుకున్నాం. కొంతమంది నాయకులు నాటిన మొక్కల్ని దోజరుతో తొలగించి కల్లం ఏర్పాటుకు అనువుగా చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు.

- వగలబోయిన నారాయణగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు

ఆక్రమణకు గురికాకుండా..



ఈత వనం స్థలం ఆక్రమణకు గురి కాకుండా చూడాలి. తొలగించిన మొక్కల స్థానంలో మొక్కలు అందించి డ్రిప్పు సౌకర్యం కల్పించాలి. గీత కార్మికులకు జీవనోపాధి లేకుండా చేస్తున్న వారితో పాటు అక్రమంగా షెడ్డు నిర్మాణం చేపట్టి స్థల కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టి మా భూమిని రక్షించాలి.

-తాళ్లపల్లి శ్రీధర్‌గౌడ్, గౌడ సంఘం సభ్యుడు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న టిప్పర్‌తో పోలీసులు

చిన్నకోడూరు, జూలై 11: అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా అనే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను చిన్నకోడూరు శివారులో గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు తనిఖీ చేసి ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ రాకేశ్, యజమాని అంజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మిరుదొడ్డి, జులై11: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని పెద్దచెప్యాలలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మరిపెల్లి రేణుకా(42) అనే మహిళ ఇంట్లోని నల్లమోటర్‌ను ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందింది. మిరుదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

కొండపాక, జూలై 11: మండలంలోని దమ్మకపల్లికి చెందిన జామ చెట్టు కిష్టయ్య(38)అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భూతగాదాల విషయంలో కలత చెంది గురువారం రాత్రి పురుగుల మందు తాగిన అతడిని కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

మైనర్‌పై అత్యాచారం చేసిన యువకుడికి రిమాండ్

మద్దూరు, జూలై 11: మద్దూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌ను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడిని అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ ఎల్. శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ఓ గ్రామానికి చెందిన కొండెపోగు మదన్‌బాబు (23) ఓ మైనర్‌ను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసినట్లు రుజువు కావడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

● గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

రాయపోల్, జూలై 11: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతున్నాయని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. రాయపోల్ మండలం రాంసాగర్‌లో పెద్దమ్మ గుడిలో సంవత్సర కాలంలో రెండుసార్లు దొంగతనం జరిగింది. రాయపోల్ పోలీసుల సూచన మేరకు గ్రామ ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ గుడిలో 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను గురువారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రఘుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి



పల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేసీఆర్

మర్కుక్/చేర్యాల, జూలై 11: మర్కుక్‌కు మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలిశారు. ఎమ్మెల్యేతో పాటు జనగామ నియోజకవర్గం యూత్ నాయకులు ఉల్లెంగుల సందీప్, ముత్యాల దయాకర్, రావెళ్ల రవి, తిప్పారపు విజయ్, శ్రీశైలం, వంశి తదితరులు ఉన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కొమురవెల్లి మల్లన్నకు అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంత రం ఆలయ ఆవరణలో కార్యకర్తల సమక్షంలో ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పార్టీ మండలాధ్యక్షులు అనంతుల మల్లేశం, మేక సంతోశ్, మంద యాదగిరి, నాయకులు పెడుతల ఎల్లారెడ్డి, జింకల పర్వతాలుయాదవ్, పచ్చిమడ్ల మానస, శివగారి అంజయ్య, గదరాజు చందు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

కోహెడ/కుకునూరుపల్లి/బెజ్జంకి/హుస్నాబాద్, జూలై 11: మండలంలోని ఎన్టీఆర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కేంద్రహోంశాఖ సహాయ మంత్రిబండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ నాయకులు గురువారం ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మాజీ ఎంపీటీసీ స్వరూప, బీజేపీ జిల్లా, మండల నాయకులు గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్, బొమ్మగాని శివకుమార్, రాంచంద్రరెడ్డి, కొండబత్తిని సతీష్, బండ సుమన్, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు సంజీవ్, నారాయణ, శ్రీనివాస్, గీత, మహేష్, శంకర్, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు. కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను కుకునూరుపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు శివకుమార్, మన్నె శేఖర్, గౌరారం కృష్ణ, నాయకులు భారీగా పాల్గొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో బెజ్జంకిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అజయ్‌వర్మ, మల్లేశంగౌడ్, రాములు, రాజు, రామచంద్రం, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి



ఎల్కల్ గ్రామంలో నిరసన తెలుపుతున్న భూ నిర్వాసితులు

రాయపోల్, జూలై 11: త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. రాయపోల్ గిర్దావర్ భానుప్రకాష్‌రావు గురువారం గ్రామానికి వచ్చి వివరాలు ఇవ్వాల్సిందిగా నిర్వాసితులను కోరారు. అందుకు నిరాకరించిన నిర్వాసితులు బ్యానర్ చేత పట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతూ అతనితో వాగ్వాదానికి దిగారు. తాము వివరాలు ఇవ్వబోమని తేల్చిచెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుకు రీజనల్ రింగ్ రోడ్డుకు మధ్య దూరం కేవలం 28 కిలోమీటర్లు మాత్రమే ఉన్నదని, చట్ట ప్రకారం 60 కిలోమీటర్ల దూరం ఉండాలని, అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే భూమికి బదులు భూమి ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని తేల్చిచెప్పారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఎవరూ వినకపోవడంతో గిర్దావర్ వెనుదిరిగి వెళ్లిపోయారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వాసితులు కొద్దిసేపు నిరసన తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

మద్దూరు, జూల్ 11: మండలంలోని లద్నూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వీడ్కోల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్ మాట్లాడారు. ఉపాధ్యాయుడు హరిప్రసాద్ సేవలు మరువలేనివన్నారు. ఆయనను పూలమాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ చైర్‌పర్సన్ శారద , రేబర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదరాజు, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

జగదేవ్‌పూర్, జూలై 11: తిగుల్ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ తిగుల్ గ్రామ అధ్యక్షుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్ గుప్తా రూ. 50,000వేల విరాళాన్ని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. ప్రవీణ్ చేసే సామాజిక కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జగదేవ్‌పూర్ మండలం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బట్టు మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ యువజన మండల విభాగం అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, కరుణాకర్, ఎండీ. కుద్దుస్, పన్నీరు లోకేష్, మనోజ్, మహేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎడ్ల జనార్దాన్‌రెడ్డి, బాలకృష్ణ, హనుమాన్ యూత్ అధ్యక్షుడు కొట్టాల మహేష్, నరేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హుస్నాబాద్, జూలై 11: హుస్నాబాద్ పట్టణంలోని పలుచోట్ల గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల పత్రాలను పరిశీలించారు. ఇందులో ఎస్ఐ తోట మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీజీఐఐసీ చైర్మన్‌ను కలిసిన నర్సారెడ్డి

గజ్వేల్, జూలై 11: టీజీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తూర్పు నిర్మలా జగ్గారెడ్డిని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సన్మానం చేసి, శుభాకాంక్షలు చెప్పారు.. అనంతరం బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నూతి శ్రీకాంత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట నాయకులు నరేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, సమీర్, రాజు, అజ్గర్ ఉన్నారు.

సామాజిక తనిఖీపై గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీడీవో

కుకునూరుపల్లి, జూలై 11: సోషల్ ఆడిట్‌లో భాగంగా లకుడారం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఉమ్మడి కొండపాక మండలం ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అధికారులు గ్రామంలో 2023-24 సంవత్సరానికి గాను చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఖర్చుల వివరాలను గ్రామసభకు తెలియజేశారు. కుకునూరుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్‌లో ఎన్ఆర్ఈజీఎస్ ఆడిట్ ప్రత్యేకాధికారి రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరిప్రసాద్, తిరుపతి, టీఏ శ్రీనివాస్, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

● తిగుల్ గ్రామ నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జగదేవ్‌పూర్, జూలై 11: జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకపక్షంగా ప్రకటించడాన్ని గ్రామశాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని తిగుల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. తిగుల్ గ్రామంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల అత్యవసర సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. అనంతరం సీనియర్ నాయకులు, యువకులు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నడూ పార్టీ కోసం పనిచేయని వారిని, ఎక్కడ అధికారం ఉంటే అక్కడకు వెళ్లే నాయకులను, తమ తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికార పార్టీలోకి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్న డీసీసీ అధ్యక్షుడి చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉద్దమరి బలరాం, బట్టు కన్నారెడ్డి, పూసల రవి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి బునారి రాజు, నాగెల్లి బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, ముత్యాలు, రామచంద్రం, మల్లారెడ్డి, రాములు, వెంకటేష్, భానుచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పీరీల' సందడి



మద్దూరులో సందడి చేస్తున్న పీరీలు

మద్దూరు, జూలై 11: మండలంలోని పలు గ్రామాల్లో పీరీల సందడి మొదలైంది. లద్నూరు గ్రామానికి చెందిన పీరీలు గురువారం మద్దూరు, మర్మాముల, సలాఖ్‌పూర్, ధర్మారం, గాగిల్లాపూర్, వంగపల్లి, ఉప్పరోనిగడ్డ, వెల్దండ గ్రామాల్లో సందడి చేశాయి. కార్యక్రమంలో టీం లీడర్ శ్యామలీల, చందు, నర్సింహులు, సంపత్, పాపయ్య, మధుకర్, యాకుబ్, నరేష్, బాబు, రాజు పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో ఆపరేషన్ ముస్కాన్

కుకునూరుపల్లి, జూలై 11: మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో అధికారులు బాలకార్మికుడిని గుర్తించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా గజ్వేల్ డివిజన్ చైల్డ్ లేబర్ అధికారులు కుకునూరుపల్లిలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని ఓ ఫుడ్ కోర్ట్‌లో 12 సంవత్సరాల వయసు ఉన్న బాలుడు పనిచేస్తున్నాడని గుర్తించి కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫుడ్‌కోర్టు యజమానిపై కేసునమోదు చేశారు. అధికారులు బాలకార్మికుడిని చైల్డ్‌లేబర్ కార్యలయంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ఇసుక వేలంతో రూ.50 వేల ఆదాయం

దూళిమిట్ట, జూలై 11: మండలంలోని జాలపల్లి గ్రామంలో ఇటీవల సీజ్ చేసిన దాదాపు 50 ట్రాక్టర్ల ఇసుక డంపును గురువారం తహసీల్దార్ ఏర్రోళ్ల శ్యామ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర వేలం వేశారు. ఈ వేలంలో ఏడుగురు సభ్యులు పాల్గొనగా ముగ్గురు సభ్యులు రూ.50 వేలు అధికంగా పాటపాడి ఇసుకను దక్కించుకున్నారు.

రైతులు పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

● ఏవో బూరెల రామకృష్ణ



కూటిగల్‌లో వివరాల నమోదును పరిశీలిస్తున్న ఏవో

మద్దూరు/దూళిమిట్ట, జూలై 11: ఈ వానాకాలానికి సంబంధించి రైతులు పంట వివరాలను తప్పనిసరిగా ఆయా క్లస్టర్ ఏఈవోల వద్ద నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ సూచించారు. మద్దూరులో గురువారం పంటల వివరాల నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులందరూ తప్పనిసరిగా సర్వే నెంబర్ల వారిగా సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, కంది, పెసరతో పాటు ఇతర పంటల్ని తప్పని సరిగా ఆన్‌లైన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. దూళిమిట్ట మండలంలోని రైతులందరూ ఈ వానకాలం 2024 సంవత్సరానికి సంబంధించి వేసిన అన్ని రకాల పంటల వివరాలను ఆయా గ్రామాల ఏఈవోల దగ్గర తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. కూటిగల్‌లో గురువారం ఆయన పంటల వివరాల నమోదును పరిశీలించారు. పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా రాబోయే కాలంలో పంటల క్రయవిక్రయాలకు ఉపయోగపడటంతో పాటు మండలంలో వేసిన వివిధ రకాల పంటల లెక్కలు తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలి

● మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● బీజేపీ గజ్వేల్ నాయకుల డిమాండ్

గజ్వేల్, జూలై 11: అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలని బీజేపీ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, అనంతరం డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించాలని, మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయ డీఏవో ఆరీఫాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం హోదాలో కేసీఆర్ గజ్వేల్‌కు వచ్చి 5వేల ఇళ్లను ప్రకటించారని, కానీ కేవలం 1100 ఇళ్లకు మాత్రమే లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారని, వారికి కూడా ఇళ్లను అప్పగించకపోవడం సిగ్గుచేటన్నారు. వారితో సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మన్నె శేఖర్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సుమతి, పట్టణ కార్యదర్శి మంద వెంకట్‌రెడ్డి, మైస విజయ్, వడ్డేపల్లి ప్రసాద్, కొన్నే రాజశేఖర్‌రెడ్డి, చిన్నోజీ నీరజ, నాగు ముదిరాజ్, మఠం మహిపాల్‌యాదవ్, దువ్వల రాజు, రోహిత్, వినోద, తలారి రాజు తదితరులున్నారు.



గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అక్రమ సిట్టింగ్ నిర్వహకుల బైండోవర్

చేర్యాల, జూలై 11: చేర్యాల మండలం గుర్జకుంట గ్రామ శివారులోని దాబాలలో అక్రమంగా సిట్టింగ్ కొనసాగిస్తున్న పలువురు నిర్వహకులపై కేసులు నమోదు చేసి తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా దాబాలలో సిట్టింగ్ నిర్వహిస్తే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిరత్న పురస్కార గ్రహీత రామకోటి రామరాజుకు సన్మానం



రామరాజును సన్మానిస్తున్న ఆర్యవైశ్య భక్తి బృందం సభ్యులు

జగదేవ్‌పూర్, జూలై 11: శ్రీరామ కోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు రామకోటి రామరాజుకు భక్తి రత్న జాతీయ పురస్కారం వచ్చిన సందర్భంగా జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య భక్తబృందం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య భక్త బృందం సభ్యులు మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న ఆధ్యాత్మిక సేవ అమోఘమన్నారు. కార్యక్రమంలో చిగుళ్లపల్లి వెంకటేశం, మడిపడిగె రామకృష్ణ, పెద్ది శంకర్, కొండల్, చంద్రశేఖర్, హరినాథ్, సత్యపాల్, వీరయ్య భక్తబృంద సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

మద్దూరు, జూలై 11: లద్నూరులోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారి స్టువర్ట్‌సన్ సిబ్బందితో కలిసి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. జనాభా పెరుగుదలను కుటుంబ నియంత్రణ ద్వారా అరికట్టాలన్నారు. జనాభా పెరుగుదలతో పేదరికం, ఆర్థిక సమస్యలు, వనరుల కొరత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శ్యామల, హెచ్ఏ దేవదాసు, ఏఎన్ఎం సౌందర్య, ఆశాలు ప్రవళిక, పద్మ ఉన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



పాండురంగం

సిద్దిపేట అర్బన్, జూలై 11: ఇందూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ ఆఫ్ ఇమానిటీస్ అండ్ సైన్స్‌గా పని చేస్తున్న పాండురంగం డాక్టరేట్ పొందారు. ఆధ్యాత్మికశాస్త్ర విభాగంలో చేసిన కృషికిగాను ఎరిజోన్ గ్లోబల్ యూనివర్సిటీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో డాక్టరేట్ తీసుకున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ వీపీ.రాజు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న పాండురంగాన్ని కళాశాలలో సిబ్బందితోపాటు సహచర ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పీఆర్వో రఘు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ వడ్డెర కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడి నియామకం



నియామకం పత్రం అందుకుంటున్న అశోక్

దుబ్బాక, జులై11: బీజేపీ ఓబీసీ మోర్చా వడ్డెర కార్మిక విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా సంపంగి అశోక్‌ను నియమిస్తూ ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దుబ్బాక మండలం బల్వాంతాపూర్ గ్రామానికి చెందిన అశోక్ పదేళ్లుగా బీజేపీలో క్రియాశీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావుతోపాటు జిల్లా పార్టీ అధ్యక్షులకు, కార్యదర్శులకు, వివిధ శక్తికేంద్రాల సభ్యులందరికీ సంపంగి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దుబ్బాక, జులై 11: దుబ్బాక మున్సిపల్‌లోని దుంపలపల్లి పాఠశాల విద్యార్థులకు గురువారం ఎన్ఆర్ఐ బెస్ట్ రన్నర్ సంస్థ సైకిళ్లు పంపిణీ చేసింది. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నెవనితారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ అధికం సుగుణబాలకిషన్, మండల విద్యాధికారి ప్రభుదాస్‌ల ఆధ్వర్యంలో సుమారు 30 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇల్లెందుల శ్రీనివాస్, బాలకిషన్, బోయరాములు తదితరులున్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న కోల శ్రీజ

అక్కన్నపేట, జూలై 11: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డ్స్, షూస్‌లను పూర్వ విద్యార్థి కోల శ్రీజ తన సొంత డబ్బులతో గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుగులోతు రంగానాయక్, మాజీ సర్పంచ్ మార్క తిరుపతిగౌడ్, విద్యాకమిటీ చైర్మన్ సూదుల సతీష్‌గౌడ్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు మ్యాక మానస, ఉపాధ్యాయులు పంతులునాయక్, కందుకూరి శ్రీనివాస్, చందా మురళీధర్, ముబీన్ అలీ, కండెం శ్రీనివాస్, వెంకన్న, రాజేందర్, లింగన్న, నాగరాజు పాల్గొన్నారు



తిగుల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వానమ్మ.. ఒక్కసారి వచ్చిపోవమ్మా..

వరుణుడు కరుణించాలని... వానలు బాగా పడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లో గురువారం మహిళలు జల కడువలను ఓ చోట చేర్చి బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం ఆ కడువల్లోని నీటిని గ్రామదేవత ఆలయాల్లో పోసి వర్షాలు బాగా కురవాలని, పంటలు పండాలని మొక్కులు మొక్కారు.

జగదేవ్‌పూర్, జూలై 11